# సంగారెడ్డిలో ఘనంగా శివాజీ జయంతి వేడుకలు

- శివాజీ విగ్రహానికి ఫోరమ్ ఫర్ బెటర్ సంగారెడ్డి నివాళి
- బహుజన చక్రవర్తిగా శివాజీ మహారాజ్ ఖ్యాతి
- నేటి యువతకు ఆయన జీవితం ఆదర్శం



**సంగారెడ్డి, ఫిబ్రవరి 19 (జనం పవర్):**

ఛత్రపతి శివాజీ మహారాజ్ 396వ జయంతిని పురస్కరించుకుని సంగారెడ్డి బైపాస్ రోడ్డులోని శివాజీ చౌక్ వద్ద వేడుకలు ఘనంగా జరిగాయి. ఫోరమ్ ఫర్ బెటర్ సంగారెడ్డి నాయకులు శివాజీ విగ్రహానికి పూలమాలలు వేసి భక్తిశ్రద్ధలతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఫోరమ్ అధ్యక్షులు శ్రీధర్ మహేంద్ర మాట్లాడుతూ.. భారతదేశ పోరాట చరిత్రలో శివాజీ మహారాజ్ ధీరత్వం కలిగిన బహుజన చక్రవర్తిగా నిలిచారని కొనియాడారు. చిన్నతనం నుంచే భారతీయుల సాంస్కృతిక ఆత్మగౌరవం కోసం పోరాడిన గొప్ప ధైర్యశాలి అని పేర్కొన్నారు. ఆయన పరిపాలన అంతా బహుజనుల హితం కోసమే కొనసాగిందని, అందుకే ఆయనకు అంతటి ఖ్యాతి లభించిందని వివరించారు. శివాజీ జీవిత చరిత్రను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని శ్రీధర్ మహేంద్ర పిలుపునిచ్చారు. సమాజంలో జరుగుతున్న అన్యాయాలు, దౌర్జన్యాలపై పోరాటం చేయాలని కోరారు. బహుజనుల హక్కుల సాధన కోసం నేటి తరం యువత అంకితభావంతో పనిచేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఫోరమ్ ఉపాధ్యక్షులు సజ్జద్ ఖాన్, ప్రధాన కార్యదర్శి అమిదిపురం మహేష్ కుమార్, సహ కార్యదర్శి పాండురంగం పాల్గొన్నారు. వీరితో పాటు కార్యవర్గ సభ్యులు సాయి వరాల, కృష్ణ రెడ్డి, సుమన్, సర్వేష్ చారి, శ్రీకాంత్ రెడ్డి తదితరులు పాల్గొని వేడుకలను జయప్రదం చేశారు.

# బహుజన చక్రవర్తిగా శివాజీ మహారాజ్ ఖ్యాతి



- శివాజీ జయంతి వేడుకల్లో పాల్గొన్న బీజేపీ నాయకులు
- ఆయన ఆశయాలను యువత ఆదర్శంగా తీసుకోవాలి
- సంగారెడ్డి 12వ వార్డులో ఘన నివాళి

**సంగారెడ్డి, ఫిబ్రవరి 19 (జనం పవర్):**

సంగారెడ్డి బైపాస్ రోడ్డులోని 12వ వార్డులో ఛత్రపతి శివాజీ మహారాజ్ 396వ జయంతి వేడుకలను బీజేపీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శివాజీ మహారాజ్ చిత్రపటానికి పూలమాలలు వేసి భక్తిశ్రద్ధలతో నివాళులర్పించారు. ఈ వేడుకల్లో బీజేపీ నేత సాహితీ రాము మాట్లాడుతూ.. భారతదేశ పోరాట చరిత్రలో శివాజీ మహారాజ్ సాటిలేని వీరుడని కొనియాడారు. చిన్ననాటి నుంచే భారతీయుల సాంస్కృతిక ఆత్మగౌరవం కోసం పోరాడిన ధైర్యవంతుడని పేర్కొన్నారు. శివాజీ పాలన బహుజనుల హితం కోసమే సాగిందని, అందుకే ఆయన బహుజన చక్రవర్తిగా ఖ్యాతి పొందారని వివరించారు. నేటి యువత శివాజీ జీవిత చరిత్రను ఆదర్శంగా తీసుకోవాలని సాహితీ రాము పిలుపునిచ్చారు. సమాజంలో జరుగుతున్న అన్యాయాలు, దౌర్జన్యాలపై పోరాడి బహుజనుల హక్కుల సాధన కోసం కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు ప్రతాప్, శ్రీనివాస్, విట్టల్ తదితరులు పాల్గొన్నారు.




# సంగారెడ్డిలో ఘనంగా శివాజీ జయంతి శోభాయాత్ర





**శివభక్తితో మార్మోగిన పట్టణ వీధులు**

**యువత ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ**

**పోలీసుల పటిష్ట బందోబస్తు మధ్య వేడుకలు**

**సంగారెడ్డి, ఫిబ్రవరి 19 (జనం పవర్):**

సంగారెడ్డి పట్టణం గురువారం శివభక్తితో మార్మోగింది. హిందూ సంఘాల ఆధ్వర్యంలో ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని ప్రధాన వీధుల గుండా శివాజీ మహారాజ్ విగ్రహంతో శోభాయాత్రను చేపట్టారు.

### ప్రత్యేక ఆకర్షణగా బైక్ ర్యాలీ

శోభాయాత్రకు అనుసంధానంగా నిర్వహించిన భారీ బైక్ ర్యాలీ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. యువత పెద్ద సంఖ్యలో పాల్గొని 'జై భవాని', 'జై శివాజీ' నినాదాలతో వీధులన్నీ మార్మోగించారు. కాషాయ జెండాలతో అలంకరించిన వాహనాలు, డప్పుల మోతతో పట్టణమంతా ఉత్సవ వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో హిందూ సంఘాల నాయకులు, కార్యకర్తలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

### ప్రశాంతంగా ముగిసిన యాత్ర

శివాజీ మహారాజ్ ధైర్యసాహసాలు, పాలనా నైపుణ్యం, స్వరాజ్య సాధనకు చేసిన పోరాటం నేటి తరానికి ఆదర్శమని పలువురు నేతలు కొనియాడారు. శోభాయాత్ర ప్రశాంతంగా సాగేందుకు పోలీసులు ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పటిష్ట భద్రతా చర్యలు చేపట్టడంతో కార్యక్రమం శాంతియుతంగా ముగిసింది.

# పసల్వాదిలో శివాజీ విగ్రహ ఆవిష్కరణ

**హిందూ సామ్రాజ్య నిర్మాత శివాజీ మహారాజ్**

**పరమత సహనం పాటించిన గొప్ప పాలకుడు**

**పసల్వాదిలో ఘనంగా విగ్రహ ప్రతిష్టాపన**



**సంగారెడ్డి, ఫిబ్రవరి 19 (జనం పవర్):**

సంగారెడ్డి మండలం పసల్వాది గ్రామంలో ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహాన్ని ఘనంగా ఆవిష్కరించారు. జయంతి వేడుకల సందర్భంగా ప్రగతి యువజన సంఘం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. కీర్తిశేషులు రాజ నందిని దేవి జ్ఞాపకార్థంగా, పట్నం మాణిక్యం సహకారంతో విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. జ్యోతిర్ వాస్తు విద్యాపీఠం వ్యవస్థాపకులు డాక్టర్ మహేశ్వర శర్మ సిద్ధాంతి చేతుల మీదుగా ఈ ఆవిష్కరణ కార్యక్రమం దిగ్విజయంగా జరిగింది. ఈ సందర్భంగా డీసీసీబీ మాజీ వైస్ చైర్మన్ పట్నం మాణిక్యం మాట్లాడుతూ.. ఛత్రపతి శివాజీ హిందూ సామ్రాజ్యాన్ని నిర్మించిన భరతమాత వీరపుత్రుడని కొనియాడారు. సొంత మతాన్ని కాపాడుకుంటూనే పరమత సహనంతో రాజ్యాన్ని పాలించిన గొప్ప లౌకిక పాలకుడని, రాజనీతి నిపుణుడని ప్రశంసించారు. మరాఠా సామ్రాజ్య స్థాపకుడైన శివాజీ మహారాజ్ దేశ రక్షణ కోసమే జన్మించారని, ఆయన జననం భవాని మాత ప్రసాదించిన వరమని పేర్కొన్నారు. ఈ విగ్రహ ఆవిష్కరణలో గ్రామ పెద్దలు, యువకులు, ప్రగతి యువజన సంఘం సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. శివాజీ మహారాజ్ ఆశయాలను స్మరిస్తూ జై శివాజీ నినాదాలతో గ్రామం మార్మోగింది.

# స్వగ్రామంపై మమకారం చాటిన ఎన్ఆర్ఐ దంపతులు

**గుగ్గిళ్లలో వృద్ధులకు, వికలాంగులకు భారీ విరాళం**

**లక్షా ఇరవై వేల రూపాయల విలువైన వస్తువుల పంపిణీ**

**దాతల సేవా గుణాన్ని కొనియాడిన సర్పంచ్ మల్లయ్య**



**బెజ్జంకి, ఫిబ్రవరి 19 (జనం పవర్):**

బెజ్జంకి మండలం గుగ్గిళ్ల గ్రామానికి చెందిన కేడిక బాల్ రెడ్డి-నాగరాణి దంపతులు తమ మాతృభూమిపై ఉన్న ప్రేమను చాటుకున్నారు. ఉద్యోగరీత్యా అమెరికాలో స్థిరపడిన వీరు, తమ తల్లిదండ్రులు కీర్తిశేషులు కేడిక సత్యమ్మ-రాంరెడ్డి జ్ఞాపకార్థం గురువారం గ్రామంలో సేవా కార్యక్రమాలు నిర్వహించారు. గుగ్గిళ్ల, తిమ్మాయ్యపల్లి గ్రామాలకు చెందిన వృద్ధులకు, వితంతువులకు, వికలాంగులకు తమ వంతు సహాయంగా సుమారు 1,20,000 రూపాయల విలువైన వస్తువులను అందజేశారు. గ్రామ సర్పంచ్ గుగ్గిళ్ల మల్లయ్యతో కలిసి దాతలు 45 మందికి దుప్పట్లు, 40 మందికి స్టీల్ చేతికర్రలు, 10 మందికి నడక స్టాండ్లు (వాకర్లు), 17 మందికి దుస్తులు, రెండు వీల్ ఛైర్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎన్ఆర్ఐ దంపతులు మాట్లాడుతూ.. పుట్టి పెరిగిన గ్రామానికి, తల్లిదండ్రుల గుర్తుగా సేవ చేయడం తమకు ఎంతో తృప్తిని ఇచ్చిందని తెలిపారు. సర్పంచ్ మల్లయ్య మాట్లాడుతూ.. గతంలో కూడా వీరు సొంత నిధులతో గ్రామంలో ఫంక్షన్ హాల్ నిర్మించి పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఎంతో మేలు చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ నాగేశ్వర్ రావు, వార్డు సభ్యులు రాజిరెడ్డి, భూలక్ష్మి, శ్రీనివాస్, సంపత్ పాల్గొన్నారు. వీరితో పాటు తిమ్మాయ్యపల్లి సర్పంచ్ సత్తవ్వ, పుష్పలత, వెంకట్ రెడ్డి, భూమయ్య, ఇతర గ్రామ పెద్దలు, గ్రామస్థులు హాజరై దాతలను అభినందించారు.

# యాంకి గ్రామంలో ఘనంగా ఛత్రపతి శివాజీ జయంతి

**ఆంజనేయ స్వామి ఆలయం నుంచి భారీ శోభాయాత్ర**

**శివా చౌక్ వద్ద విగ్రహానికి ప్రత్యేక పూజలు**

**వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్న గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు**

**దౌల్తాబాద్, ఫిబ్రవరి 19:**

దౌల్తాబాద్ మండల పరిధిలోని యాంకి గ్రామ పంచాయతీలో ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల సందర్భంగా గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. స్థానిక యువత, ప్రజలు ఈ ఉత్సవాల్లో భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు. ఈ వేడుకల్లో భాగంగా గ్రామంలోని శ్రీ ఆంజనేయ స్వామి గుడి వద్ద నుంచి శివాజీ శోభాయాత్రను లాంఛనంగా ప్రారంభించారు. ఈ యాత్ర గ్రామ ప్రధాన వీధుల గుండా ఉత్సాహంగా సాగుతూ శివా చౌక్ వద్దకు చేరుకుంది. దారిపొడవునా భక్తులు చేసిన జై శివాజీ నినాదాలతో వీధులన్నీ మారుమోగాయి. శివా చౌక్ వద్ద ఉన్న ఛత్రపతి శివాజీ విగ్రహానికి పూలమాలలు వేసి, ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. దేశం కోసం, ధర్మ రక్షణ కోసం శివాజీ మహారాజ్ చేసిన అద్భుతమైన పోరాటాలను ఈ సందర్భంగా స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, యువకులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పురపాలక ఎన్నికల్లో బీసీల రికార్డు విజయం

**62 శాతం సీట్లతో సత్తా చాటిన బీసీ అభ్యర్థులు**

**42 శాతం టికెట్లు ఇచ్చినా అంతకు మించి విజయం**

**60 శాతం పదవులు దక్కించుకున్న మహిళలు**

**తుడుం జితేందర్ - జనం పవర్ - ఉత్తర తెలంగాణ బ్యూరో**



తెలంగాణ రాష్ట్రంలో బీసీ కులాల రాజకీయ పోరాటం అద్భుత ఫలితాలను ఇస్తోంది. ఇటీవల జరిగిన పురపాలక, నగరపాలక సంస్థల ఎన్నికల్లో బీసీ అభ్యర్థులు ఏకంగా 62 శాతం సీట్లు గెలుచుకుని కొత్త చరిత్ర సృష్టించారు. వివిధ రాజకీయ పార్టీలు 42 శాతం టికెట్లు మాత్రమే కేటాయించినా, క్షేత్రస్థాయిలో వచ్చిన మార్పు వల్ల బీసీ నేతలు రికార్డు స్థాయిలో విజయం సాధించారు.

### ఉద్యమ ప్రభావంతోనే చైతన్యం

గత నాలుగేళ్లుగా తెలంగాణ తో పాటు ఢిల్లీ వేదికగా నిర్వహించిన అనేక పోరాటాల వల్ల ప్రజల్లో రాజకీయ అవగాహన పెరిగిందని బీసీ కులాల ఉద్యమ పోరాట సంఘం నేతలు పేర్కొన్నారు. గత ఏడాది డిసెంబర్ నెలలో జరిగిన సర్పంచ్ ఎన్నికల్లోనూ 50 శాతానికి పైగా బీసీలే గెలిచారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వేగంగా ఎన్నికలు నిర్వహించడం, స్థానిక ప్రజాప్రతినిధుల సహకారంతో ఎక్కువ మందికి అవకాశాలు లభించాయి. ఫలితంగా మున్సిపల్ చైర్మన్లు, మేయర్లుగా అత్యధిక శాతం బీసీలు ఎన్నికయ్యారు.

### మహిళల ప్రాతినిధ్యం అమోఘం

ఈ ఎన్నికల్లో బీసీ మహిళలు తమ సత్తా చాటారు. దాదాపు 60 శాతం సమీపంలో పదవులను మహిళలే దక్కించుకోవడం విశేషం. ఇదే స్ఫూర్తితో 2029 శాసనసభ, పార్లమెంటు ఎన్నికల్లోనూ బీసీల ప్రతాపాన్ని చూపాలనే లక్ష్యంతో ముందుకు సాగుతామని నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ప్రతినిధులు కోడూరి చంద్రయ్య, కడార్ల నరసయ్య, గూడ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# జన్నారంలో అక్రమ రవాణా కలకలం

**అటవీ శాఖకు చిక్కిన భారీ లారీ**

**పోలీస్ స్టేషన్ దాటినా దొరకని వాహనం.. చెక్‌పోస్ట్ వద్ద పట్టివేత**

**అప్రమత్తంగా వ్యవహరించిన అటవీ అధికారులు**

**నిఘా వైఫల్యంపై సర్వత్రా విమర్శలు**



**తుడుం జితేందర్ - జనం పవర్ - ఉత్తర తెలంగాణ బ్యూరో**

అటవీ సంపద రక్షణలో అధికారుల మధ్య సమన్వయ లోపం స్పష్టంగా కనిపిస్తోంది. జన్నారం పోలీస్ స్టేషన్ పరిధిలో పోలీసుల కళ్లుగప్పి వెళ్తున్న ఒక భారీ ఫర్నిచర్ లారీని అటవీ శాఖ అధికారులు చాకచక్యంగా పట్టుకోవడం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. గురువారం రాత్రి ఈ ఘటన చోటుచేసుకుంది. అటవీ ప్రాంతం గుండా రాత్రి వేళల్లో వెళ్లే వాహనాలపై కనీస తనిఖీలు చేపట్టాల్సిన బాధ్యతను పోలీసులు విస్మరించారనే ఆరోపణలు వస్తున్నాయి.

### చెక్‌పోస్ట్ వద్ద పట్టివేత

జన్నారం పోలీస్ స్టేషన్ ముందు నుంచే లారీ వెళ్తున్నా అక్కడి సిబ్బంది పట్టించుకోకపోవడం గమనార్హం. అయితే తాపల్‌పూర్ చెక్‌పోస్ట్ వద్ద అటవీ శాఖ బీట్ అధికారిణి జ్యోతి తన సిబ్బందితో కలిసి ఆ వాహనాన్ని అడ్డుకున్నారు. రాత్రి 9:30 గంటల సమయంలో వాహనాన్ని నిలిపివేసి తనిఖీ చేయగా అక్రమ రవాణా విషయం బట్టబయలైంది. లారీకి సరైన పత్రాలు లేకపోవడం, నిషేధిత అటవీ ప్రాంతంలోకి రాత్రి వేళ అనుమతి లేకుండా ప్రవేశించడంపై అధికారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

### అధికారుల సమయస్ఫూర్తి

ఈ ఆపరేషన్‌లో అటవీ శాఖ సెక్షన్ అధికారి శంకర్, బీట్ అధికారులు కృష్ణమూర్తి, సాయి తో పాటు సింగరాయిపేట బేస్ క్యాంప్ వాచర్లు పాల్గొన్నారు. పట్టుబడిన లారీని స్వాధీనం చేసుకుని తదుపరి విచారణ కోసం రేంజ్ కార్యాలయానికి తరలించారు. అటవీ అధికారులు సకాలంలో స్పందించకపోతే ఆ అక్రమ లోడ్ లక్సెట్టిపేటకు చేరిపోయేదని తెలుస్తోంది. రాత్రి వేళల్లో నిఘా పెంచాలని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.




# సంగారెడ్డిలో కాషాయ దళానికి తప్పని నిరాశ

- రెండు స్థానాలకే పరిమితమైన భారతీయ జనతా పార్టీ
- ఓట్ల రూపంలో మారని యువత మద్దతు
- లోపాలపై ఆత్మపరిశీలనలో పార్టీ శ్రేణులు



**సంగారెడ్డి, ఫిబ్రవరి 19 (జనం పవర్):**

సంగారెడ్డి మున్సిపాలిటీ ఎన్నికల్లో బలంగా ఉన్న కాషాయ దళం కేవలం రెండు సీట్లకే పరిమితం కావడం రాజకీయ వర్గాల్లో పెద్ద చర్చకు దారితీసింది. యువత మొత్తం తమ వైపే ఉందన్న అంచనాలతో బరిలోకి దిగిన భారతీయ జనతా పార్టీ అభ్యర్థులు, ఫలితాలు చూసి తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రచార సమయంలో సోషల్ మీడియాలో, సభల్లో యువత ఉత్సాహంగా పాల్గొన్నప్పటికీ, ఆ మద్దతు ఓట్ల రూపంలో కనిపించకపోవడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది. స్థానికంగా యువత రాజకీయాల్లో చురుకుగా ఉన్నా, ఓటింగ్‌కు వచ్చేసరికి ఆసక్తి చూపలేదా అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. అభ్యర్థుల ఎంపికలో పొరపాట్లు జరిగాయా లేక స్థానిక సమస్యలపై స్పష్టత కరువైందా అన్న కోణంలో పార్టీ వర్గాలు ఆత్మపరిశీలన చేసుకుంటున్నాయి. ఈ ఫలితం తాత్కాలికమేనని, రాబోయే శాసనసభ ఎన్నికల్లో గెలిచి తీరుతామని కార్యకర్తలు ధీమా వ్యక్తం చేస్తున్నారు. క్షేత్రస్థాయిలో లోపాలను సరిదిద్దుకుని పార్టీని బలోపేతం చేయాలని నిర్ణయించారు. ధర్మాన్ని, సనాతన ధర్మాన్ని కాపాడుకోవడానికి హిందువులంతా ఐక్యంగా నిలబడాలని పలువురు నాయకులు పిలుపునిస్తున్నారు. కేవలం భావోద్వేగాలే కాకుండా స్థానిక సమస్యలను కూడా సమర్థవంతంగా ప్రజల్లోకి తీసుకెళ్లగలిగితేనే భవిష్యత్తులో విజయం సాధ్యమని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. రానున్న రోజుల్లో ప్రజల నమ్మకాన్ని పొందేలా క్షేత్రస్థాయి పోరాటాలు చేయాలని బీజేపీ శ్రేణులు భావిస్తున్నాయి.









# ఐఐటీ హైదరాబాద్‌లో ఎంఎస్ఎంఈల టెక్ కనెక్ట్ ప్రారంభం

- స్టార్టప్‌లు, పరిశ్రమ నిపుణులతో జాతీయ స్థాయి సదస్సు
- కొత్త ఆవిష్కరణలు, సాంకేతికతపై మూడు రోజుల పాటు చర్చలు
- పరిశ్రమలతో ఎంఎస్ఎంఈల అనుసంధానమే లక్ష్యం

**సంగారెడ్డి, ఫిబ్రవరి 19 (జనం పవర్):**

సంగారెడ్డి జిల్లా కందిలోని ఐఐటీ హైదరాబాద్ ఎంఎస్ఎంఈల అభివృద్ధికి జాతీయ వేదికగా నిలవనుంది. ఎంఎస్ఎంఈ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 19 నుంచి 21 వరకు 'ఎంఎస్ఎంఈ టెక్ కనెక్ట్ 2026' అనే జాతీయ స్థాయి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ వేదిక ద్వారా స్టార్టప్‌లు, పరిశోధకులు, పరిశ్రమ నిపుణులు, పెట్టుబడిదారులు ఒకచోట చేరి సరికొత్త ఆవిష్కరణలపై చర్చించనున్నారు.

### ఆవిష్కరణలకు వాణిజ్య రూపం

మూడు రోజుల పాటు జరిగే ఈ సదస్సులో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), హెల్త్‌కేర్, మాన్యుఫ్యాక్చరింగ్ వంటి కీలక రంగాల్లో వస్తున్న సాంకేతిక మార్పులపై ప్రత్యేక ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. ఎంఎస్ఎంఈలు పెద్ద పరిశ్రమలతో అనుసంధానం కావడానికి, నూతన పరిజ్ఞానాన్ని వాణిజ్యపరంగా వాడుకోవడానికి ఈ కార్యక్రమం ఎంతో ఉపయోగపడనుంది. టెక్నాలజీ లైసెన్సింగ్, పరిశోధనల బదిలీ, సహకార ఒప్పందాల వంటి అంశాలపై నిపుణులు ఈ వేదికపై వివరిస్తారు.

### పరిశ్రమల బలోపేతానికి కృషి

ప్రయోగశాలల్లో రూపుదిద్దుకున్న నూతన ఆవిష్కరణలను పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా మార్చడం ఈ సదస్సు ముఖ్య ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు. ఎంఎస్ఎంఈ రంగం ఎదుర్కొంటున్న సవాళ్లను పరిష్కరించడంతో పాటు, పెట్టుబడిదారులకు కొత్త అవకాశాలను ఈ వేదిక పరిచయం చేస్తుంది. కార్యక్రమంలో ఐఐటీ ప్రతినిధులు, వివిధ పరిశ్రమల ప్రముఖులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.









# అనాధ పిల్లలకు అమ్మ ప్రేమ పంచిన 'బాలవికాస'

- ఘనంగా 1,800 మంది పిల్లల జన్మదిన వేడుకలు
- కొత్త బట్టలు, పుస్తకాల పంపిణీ చేసిన దాతలు
- వంటకాలు వండి తినిపించిన మహిళా మణులు

**జనం పవర్ - సిద్దిపేట ప్రతినిధి**

సిద్దిపేట పట్టణంలోని అరుంధతి కమ్యూనిటీ ఫంక్షన్ హాల్ లో గురువారం బాలవికాస స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో అనాధ పిల్లల జన్మదిన వేడుకలు అత్యంత హృద్యంగా జరిగాయి. దాతలు, మహిళలు, స్వచ్ఛంద కార్యకర్తల సమక్షంలో పిల్లలు ఆనందోత్సాహాల మధ్య కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా దాతలు పిల్లలకు నూతన వస్త్రాలు, పుస్తకాలను అందజేసి వారిని ఆశీర్వదించారు.

### అమ్మ ప్రేమను పంచిన మహిళలు


స్థానిక మహిళలు తమ ఇళ్ల నుంచి వివిధ రకాల వంటకాలు తీసుకువచ్చి పిల్లలకు స్వయంగా తినిపించడం ఈ కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అనాధలైన తమకు సమాజం అండగా ఉందనే భరోసాను ఈ వేడుక కల్పించింది. సంస్థ ప్రతినిధులు జ్యోతి, అమూల్య మాట్లాడుతూ.. వ్యవస్థాపకురాలు బాల తెరిస్సా (బాలక్క) మార్గదర్శకత్వంలో గత 25 ఏళ్లుగా 1,800 మంది పిల్లలను అక్కున చేర్చుకుని చదివిస్తున్నట్లు తెలిపారు. కేవలం విద్యే కాకుండా వితంతువుల సంరక్షణ, రైతులకు సేంద్రియ వ్యవసాయంపై అవగాహన వంటి ఎన్నో కార్యక్రమాలు చేపడుతున్నట్లు వివరించారు. ఈ వేడుకల్లో ముఖ్య అతిథులుగా పాల్గొన్న చల్లారం రాజశేఖర్ రెడ్డి, జాగృతి కార్యదర్శి గిరి, బీఆర్ఎస్ నాయకులు జువ్వన్న ప్రసాద్ తదితరులు పిల్లలకు విరాళాలు ప్రకటించారు. మహిళలకు ఆరోగ్య అంశాలపై కూడా ఈ సందర్భంగా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బాలవికాస సమన్వయకర్తలు అన్న మేరీ, సుజాత, లక్ష్మి, స్వచ్ఛంద కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ప్రతి ఏటా ఇలాంటి సేవా కార్యక్రమాల్లో భాగస్వామ్యం అవుతామని దాతలు పేర్కొన్నారు.

# జన్నారం ప్రెస్ క్లబ్ అధ్యక్షుడి అక్రమాలపై 'దుర్యోధన ఆపరేషన్'

## పేపర్ బాయ్ స్థాయి నుంచి కోటీశ్వరుడిగా ఎదిగిన వైనం

### బ్లాక్ మెయిలింగ్, భూకబ్జాలకు పాల్పడుతున్నట్లు బాధితుల ఆరోపణలు

### ఏసీబీ విచారణ జరిపించాలని స్థానికుల డిమాండ్









**సమాజంలో జరిగే అన్యాయాలను ప్రశ్నిస్తూ, నిరుపేదల పక్షాన నిలవాల్సిన కలం దారి తప్పిందా? అక్షరాన్ని ఆయుధంగా మలచుకోవాల్సిన పాత్రికేయుడు కాసుల వేటలో పడి అక్రమాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారాడా? ఈ ప్రశ్నలకు జన్నారం మండల ప్రజలు ముక్తకంఠంతో 'అవును' అనే సమాధానం ఇస్తున్నారు. మన తెలంగాణ దినపత్రిక విలేకరి, జన్నారం ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు చిలివేరి నరసయ్య సాగిస్తున్న అక్రమ దందాలను అరికట్టేందుకు స్థానిక నాయకులు, బాధితులు ఏకమయ్యారు. ఆయన అక్రమ సామ్రాజ్యాన్ని బట్టబయలు చేసేందుకు 'దుర్యోధన ఆపరేషన్' పేరుతో భారీ ఉద్యమానికి శ్రీకారం చుట్టారు.**

**తుడుం జితేందర్ - జనం పవర్ - ఉత్తర తెలంగాణ బ్యూరో**

#### సైకిల్ పై తిరిగే స్థాయి నుంచి కోట్ల పడగ

గత రెండు మూడు దశాబ్దాలుగా జన్నారంలో విలేకరిగా కొనసాగుతున్న నరసయ్య ఆర్థిక ఎదుగుదల ఇప్పుడు సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. ఒకప్పుడు సైకిల్ మీద తిరుగుతూ ఇంటింటికీ పేపర్లు వేసిన సాధారణ వ్యక్తి, కేవలం జర్నలిజం వృత్తిలో ఉంటూ కోట్లాది రూపాయల ఆస్తులు ఎలా కూడబెట్టారన్నది స్థానికులను విస్మయానికి గురిచేస్తోంది. ఆయన పేరు మీద నాలుగు భారీ భవనాలు ఎలా వచ్చాయి? ఆయనకు ఉన్న సొంత వ్యవసాయ భూమి ఎంత? జర్నలిజం కాకుండా ఆయన చేస్తున్న ఇతర వ్యాపారాలు ఏంటి? లక్షల ఆదాయం కోట్లకు ఎలా చేరింది? తదితర ప్రశ్నలు ఇప్పుడు ప్రజల మదిలో మెదులుతున్నాయి. ఈ ఆస్తుల వెనుక ఉన్న మర్మంపై సమగ్ర విచారణ జరపాలని వారు గట్టిగా డిమాండ్ చేస్తున్నారు.

#### ఆరోపణల వెల్లువ.. భయభ్రాంతుల్లో ప్రజలు, అధికారులు

నరసయ్య తన విలేకరి పదవిని అడ్డం పెట్టుకుని సాగిస్తున్న ఆగడాలు వింటే సామాన్యులు సైతం విస్తుపోతున్నారు. తన పలుకుబడితో అటు అధికారులను, ఇటు ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారనే విమర్శలు తీవ్రంగా వినిపిస్తున్నాయి.

#### బ్లాక్ మెయిలింగ్

మండలంలో జరిగే చిన్న చిన్న పొరపాట్లను భూతద్దంలో చూపిస్తూ, వాటిని పత్రికలో పెద్ద వార్తలుగా రాస్తానని బెదిరించి అధికారుల నుంచి, ప్రజల నుంచి భారీగా వసూళ్లకు పాల్పడుతున్నట్లు సమాచారం.

#### భూకబ్జాలు

ఏ అండ లేని అమాయక ప్రజల భూములను లక్ష్యంగా చేసుకుని, తప్పుడు పత్రాలు సృష్టించి వివాదాలు రేపుతున్నారని బాధితులు వాపోతున్నారు. ఆ తర్వాత సెటిల్మెంట్ల పేరుతో ఆ భూములను తన హస్తగతం చేసుకుంటున్నారని ఆరోపిస్తున్నారు.

#### అక్రమ కేసులు

తన అక్రమాలను ఎవరైనా ప్రశ్నిస్తే, వారిపై పై అధికారులకు తప్పుడు ఫిర్యాదులు చేసి అక్రమ కేసులు బనాయిస్తున్నారని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

#### 'దుర్యోధన ఆపరేషన్' తో ఉక్కిరిబిక్కిరి

ఈ అక్రమాలకు శాశ్వతంగా అడ్డుకట్ట వేసేందుకు బాధితులంతా ఒకే తాటిపైకి వచ్చారు. నరసయ్య సంపాదించిన ప్రతి అక్రమ ఆస్తి వివరాలను, బాధితుల వద్ద ఉన్న బలమైన సాక్ష్యాలను ఆధారాలతో సహా బహిర్గతం చేస్తామని హెచ్చరిస్తున్నారు. జిల్లా యంత్రాంగం తక్షణమే స్పందించి ఏసీబీ లేదా ఉన్నత స్థాయి అధికారులతో సమగ్ర విచారణ జరిపించాలని పట్టుబడుతున్నారు.

సామాన్యుడికి అండగా చిన్న పత్రికలు

పెద్ద పత్రికల ప్రతినిధులమని చెప్పుకుంటూ కొందరు విలేకరులు అక్రమార్కులతో అంటకాగుతున్న తీరు పట్ల ప్రజల్లో తీవ్ర అసహనం వ్యక్తమవుతోంది. దీనికి భిన్నంగా, క్షేత్రస్థాయిలో సామాన్యుల సమస్యలపై నిరంతరం పోరాడుతున్న చిన్న పత్రికల విలేకరులను స్థానికులు ప్రశంసిస్తున్నారు. అక్షరాన్ని అమ్ముకోకుండా నిష్పక్షపాతంగా పనిచేస్తూ నిజమైన జర్నలిజానికి చిరునామాగా నిలుస్తున్నారని కొనియాడుతున్నారు.



# శాంతిభద్రతలు గాలికి.. మామూళ్లకే జై కొడుతున్నారా?

### జన్నారం ఎస్సై తీరుపై వెల్లువెత్తుతున్న నిరసనలు

### అక్రమార్కులకు వత్తాసు పలుకుతున్నారని ప్రజల ఆగ్రహం

### నిజాలు రాస్తే విలేకరులపై తప్పుడు కేసులు బనాయింపు

### ఎస్సై అనూషను తక్షణమే సస్పెండ్ చేయాలని జర్నలిస్టు సంఘాల డిమాండ్

### రామగుండం డీసీపీకి ఫిర్యాదు చేసిన బాధితులు

**మంచిర్యాల జిల్లా జన్నారం మండలంలో పోలీసు వ్యవస్థ పనితీరుపై సామాన్య ప్రజల నుంచి విలేకరుల వరకు తీవ్ర స్థాయిలో అసహనం వ్యక్తమవుతోంది. మండలంలో శాంతిభద్రతలను పర్యవేక్షించి ప్రజలకు రక్షణ కల్పించాల్సిన ఎస్సై గొల్లపల్లి అనూష తన విధులను పూర్తిగా విస్మరించారని స్థానికులు మండిపడుతున్నారు. అక్రమార్కులకు అండగా నిలుస్తూ చట్టాన్ని కాపాడాల్సిన బాధ్యతను గాలికి వదిలేశారనే ఆరోపణలు ఇప్పుడు మండలంలో ప్రధాన చర్చనీయాంశంగా మారాయి.**

**తుడుం జితేందర్ - జనం పవర్ - ఉత్తర తెలంగాణ బ్యూరో**

#### అక్రమాలకు అడ్డాగా మండలం.. పెట్రోలింగ్ ఎక్కడ?

గ్రామాల్లో శాంతిభద్రతల పరిరక్షణ కోసం నిరంతరం నిర్వహించాల్సిన పెట్రోలింగ్ వ్యవస్థ జన్నారంలో పూర్తిగా పడకేసింది. ప్రజలకు చట్టాలపై కనీస అవగాహన కార్యక్రమాలు నిర్వహించకపోవడం వల్లే నేరాల సంఖ్య పెరుగుతోందని స్థానికులు వాపోతున్నారు. మండలంలో జోరుగా సాగుతున్న అక్రమ వ్యాపారాలు, ఇసుక దందా, కలప రవాణా లాంటి చట్టవ్యతిరేక కార్యకలాపాలను ఏమాత్రం పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. అక్రమార్కుల వద్ద నుంచి పెద్ద మొత్తంలో ముడుపులు తీసుకుంటూ వారిని స్వేచ్ఛగా వదిలేస్తున్నారని ఆరోపిస్తున్నారు. పోలీసుల డ్యూటీ అంటే కేవలం పోలీస్ స్టేషన్ కే పరిమితం కావడమా లేక అక్రమార్కులకు కాపలా కాయడమా అని ప్రజలు సూటిగా ప్రశ్నిస్తున్నారు.

#### నిజాలు రాస్తే కక్షగట్టి అక్రమ కేసులు

మండలంలో ఇష్టారాజ్యంగా జరుగుతున్న ఈ అక్రమాలను, ఎస్సై అనుసరిస్తున్న ఏకపక్ష తీరును పత్రికల్లో కథనాల రూపంలో ప్రచురించిన విలేకరులపై ఆమె కక్ష సాధింపు చర్యలకు దిగుతున్నట్లు తెలుస్తోంది. "పోలీసుల తప్పులను ఎత్తిచూపినందుకు విలేకరులను ఉద్దేశపూర్వకంగా టార్గెట్ చేస్తూ, తప్పుడు సాక్షులను సృష్టించి అక్రమ కేసులు బనాయించడం ఏమాత్రం ప్రజాస్వామ్యబద్ధంగా లేదు. సమాజంలో జరుగుతున్న వాస్తవాలను నిర్భయంగా రాస్తే నేరుగా జైలుకు పంపుతారా?" అని జర్నలిస్టు సంఘాల నాయకులు తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

#### డీసీపీకి ఫిర్యాదు.. సమగ్ర విచారణకు డిమాండ్

విలేకరులపై జరుగుతున్న ఈ కక్ష సాధింపు చర్యలను తీవ్రంగా పరిగణించిన జర్నలిస్టుల బృందం, ఈ సమస్యపై రామగుండం పోలీస్ కమిషనరేట్ లోని డీసీపీని స్వయంగా కలిసి ఒక వినతిపత్రం సమర్పించారు. గతంలో కూడా భూ వివాదాల్లో తలదూర్చడం, నిబంధనలకు విరుద్ధంగా ఇష్టానుసారంగా కేసులు పెట్టడంపై ఎస్సై అనూషపై ఎన్నో విమర్శలు ఉన్నాయని వారు అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. విధుల్లో విపరీతమైన నిర్లక్ష్యం వహిస్తూ, అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్న ఎస్సై పై తక్షణమే ఉన్నతస్థాయి విచారణ జరిపించి సస్పెండ్ చేయాలని గట్టిగా కోరారు. మండలంలో పోలీసుల పట్ల సామాన్య ప్రజలకు ఉన్న నమ్మకాన్ని వమ్ము చేస్తున్న ఇలాంటి అధికారులపై ఉన్నతాధికారులు కఠిన చర్యలు తీసుకోకపోతే, రానున్న రోజుల్లో ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని జర్నలిస్టు సంఘాలు గట్టిగా హెచ్చరించాయి.

